నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 11 సెప్టెంబర్ 2024 | NIZAMABAD

ప్రముఖ కవి నటేశ్వర శర్మ కన్నుమూత

దివికేగిన సాహితీ శిఖరం

- సాహితీ లోకానికి ఎనలేని సేవలు
- కామారెడ్డి గడ్డపై వికసించిన విద్యాకుసుమం
- దాశరథి అవార్డుతో సత్కరించిన కేసీఆర్ ప్రభుత్వం
- నేడు హైదరాబాద్‌లో అయాచితం అంత్యక్రియలు

కామారెడ్డి గడ్డపై విరబూసిన సాహితీ కుసుమం దివికేగింది. ప్రముఖ కవి, 'దాశరథి' అవార్డు గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ (68) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఎంతో మందిని సాహితీవేత్తలుగా తీర్చిదిద్దిన ఆయన మృతితో ఉమ్మడి జిల్లాలో విషాదం నెలకొన్నది. బుధవారం బోయిన్‌పల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

-కామారెడ్డి/సుభాష్‌నగర్, సెప్టెంబర్ 2

కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో జయలక్ష్మీదేవి, ఆనందరాజశర్మ దంపతులకు 1956లో జన్మించారు నటేశ్వరశర్మ. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం అంతా రామారెడ్డిలోనే సాగింది. ఏడో తరగతి నుంచి ఎం.ఏ. వరకు తిరుపతిలో చదివారు. విద్యార్థి దశ నుంచే సాహిత్యంలో ప్రావీణ్యం సాధించి ఎందరికో మార్గదర్శకంగా నిలిచారు. ఇప్పుడు ఉన్న తెలుగు పండితులలో చాలా మంది ఆయన శిష్యులే. అయాచితం చేసిన సాహిత్య సేవలకు గాను కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక దాశరథి కృష్ణమాచార్య అవార్డుతో సత్కరించింది. నాటి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ నటేశ్వర శర్మ సేవలను ప్రత్యేకంగా అభినందించారు.

> నటేశ్వరశర్మ రచనలు అనిర్వచనీయం. ఆయన కవిత్వం భావి తరాలకు ఆదర్శం. యువ సాహితీవేత్తలకు ఆయనో మార్గదర్శి.

గొప్పగొప్ప రచనలు..

విద్యార్థి దశ నుంచే నటేశ్వర శర్మ కవితారచనలో ఆరితేరారు.1975లో తన కవితా గురువు డా.సి.నారాయణరెడ్డికి అయితు కవితా సంకలనాలను రచించి అంకితం చేశారు. సినారె రచించిన రామప్ప సంగీత రూపకాన్ని సంస్కృతంలోకి అనువదించి, ఆయన ప్రశంసలు పొందారు. కామారెడ్డిలోని ఓరియంటల్ పాఠశాలలో ఆచార్యుడిగా, ప్రధానాచార్యులుగా, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ప్రాచ్యవిభాగానికి డీన్‌గా పని చేశారు. 1975 నుంచి 2014లో పదవీ విరమణ పొందే వరకు 50కి పైగా గ్రంథాలు, రచనలు, వందకు పైగా అష్టావధానాలు చేశారు. అందులో వసంత కుమారి, శ్రీ గజాననస్తోత్రమ్, శ్రీ షోదశీ, భారతీ ప్రశస్తి, అముక్తమాల్యద పరిశీలనము, ఋతుగీత, శ్రీ శివమహిమ్నాస్తోత్రవ్యాఖ్య, సమయవిలాసిని, నవ్యగీతి, బాల రామాయణము, కవి తా శతకము, నవ్య నీతి శతకము, శ్రీ రాజేశ్వర శతకము, శ్రీ గణేశ శతకము, శ్రీ మా తృ కావర్ణమాలికా, శ్రీ రామగుణమణిమాల, ఆంధ్ర తేజం, భారతీయ శతకం, ఆరురుచుల ఆమని, పంచశరీయమ్.. ఇలా ప్రఖ్యాత రచనలు ఆయన కలం నుంచి జాలువారినవే. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అనేక మంది యువతీయువకులకు సాహిత్య ప్రక్రియల్లో చేదోడువాదోడు గా ఉంటూ వారు రాసిన పుస్తకాలకు ముందుమాట రాసి గురుస్థానాన్ని పొందారు. ఆయన సాహితీ సేవలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం.. 2023లో దాశరథి అవార్డుతో సత్కరించింది.

ఆర్నెళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్న నటేశ్వర శర్మ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి కవులు వీపీ చందన్‌రావు, కందాళై రాఘవాచార్య, చంద్రశేఖర్‌శర్మ, కాసర్ల నరేశ్ రావు, గం ట్యాల ప్రసాద్, శారదాహన్మాండ్లు, డాక్టర్ బోచకర్ ఓంప్రకాశ్, కందకుర్తి ఆనంద్, గంగాప్రసాద్, డాక్టర్ గణపతి అశోకశర్మ, డా. తల్లావజ్జల మహేశ్‌బాబు తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అయాచితం మరణం సాహితీ లోకానికి తీరని లోటని అన్నారు.

అయాచితం నటేశ్వరశర్మను దాశరథి పురస్కారంతో సత్కరిస్తున్న నాటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలో నివాళులర్పించారు. ఆమె త్యాగాలను స్మరించుకున్నారు. కామారెడ్డిలో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్, అధికారులు

పాపం పసికందు

కుక్కల దాడిలో.. బాలుడి బలి

వీధి కుక్కల వీరంగానికి ఓ బాలుడు బలయ్యాడు. చెట్టు కింద నిద్రపోతున్న పది నెలల చిన్నారిపై శునకాల గుంపు దాడి చేసి దారుణంగా చంపేశాయి. అత్యంత దయానీయమైన ఈ ఘటన బోధన్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. బాలుడిని దారుణంగా పీక్కుతిన్న ఘటనతో స్థానికులు కలవరపాటుకు గురయ్యారు. నెల క్రితమే బోధన్ తట్టికోట్‌లో ఓ చిన్నారిని నోట కరుచుకుని వెళ్లిన ఉదంతం మరువక ముందే ఈ విషాదం చోటు చేసుకోవడంతో స్థానికులను భయాందోళనకు గురి చేసింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నిత్యం ఎక్కడో ఒకచోట చేసుకుంటున్న శునకాల దాడులను, అధికారుల వైఫల్యాలపై 'నమస్తే తెలంగాణ' మంగళవారమే ప్రత్యేక కథనం ద్వారా ఎత్తిచూపింది. దీనిపై చర్చ జరుగుతున్న సమయంలోనే ఓ బాలుడు కుక్కల దాడికి బలైపోవడం పెను విషాదం నింపింది.

-శక్కర్‌నగర్, సెప్టెంబర్ 10

చిన్నారిని చిదిమేసిన శునకాలు
బోధన్‌లో విషాదకర ఘటన
స్థానికంగా కలకలం రేపిన ఉదంతం
గతంలోనూ మరో చిన్నారిపై దాడి
అయినా స్పందించని బల్దియా
వీధికుక్కలను నియంత్రించడంలో వైఫల్యం

చిన్నారిని పీక్కుతున్న కుక్కలు..

బోధన్‌లో యాచిస్తూ పొట్ట పోసుకునే ఓ మహిళకు పది నెలల కుమారుడు ఉన్నాడు. కొత్త బస్టాండ్ ప్రాంతమే ఆమెకు ఆవాసం. సోమవారం రాత్రి బాలుడు నిద్రపోగా, ఓ చెట్టు కింద బాలుడ్ని పడుకోబెట్టిన ఆమె పని మీద వెళ్లింది. కాసేపటి తర్వాత వచ్చి చూడగా చిన్నారి కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా దొరకక పోవడంతో ఎవరైనా కిడ్నాప్ చేశారని భావించిన ఆ తల్లి.. మంగళశారం ఉదయమే పోలీసులకు వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పట్టణ సీఐ వెంకటనారాయణ తన సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. బాలుడు అదృశ్యమైన ప్రాంతాన్ని జల్లెడ పడుతుండగా, మంగళవారం తెల్లవారుజామున కుక్కలు చిన్నపిల్లాడ్ని నోట పట్టుకుని వెళ్లినట్లు ఓ వ్యక్తి పోలీసులకు తెలిపాడు. అతడు చెప్పిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా, అక్కడక్కడ మాంసపు ముద్దలు లభ్యమయ్యాయి. అవి చిన్నారి అవయవాలుగా గుర్తించి, వాటిని సేకరించి బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఫుటేజీల్లో స్పష్టం

చిన్నారిని వీధికుక్కలు చిదిమేసిన ఘటన బోధన్‌లో కలకలం రేపింది. ఇప్పటికే శునకాల బెడదతో అల్లాడిపోతున్న స్థానికులు తాజా విషాదం నేపథ్యంలో వణికి పోతున్నారు. ఇటీవలే తట్టికోట్ ప్రాంతంలో ఓ బాలుడ్ని కుక్కల గుంపు మెడ పట్టుకుని ఎత్తుకెళ్తుండగా అడ్డుకున్న గర్భిణితో పాటు పలువురిపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ ఉదంతం మరిచిపోక ముందే మరో బాలుడు కుక్కలకు ఆహారంగా మారడం స్థానికంగా తీవ్ర భయాందోళనను రేకెత్తించింది. మరోవైపు, కుక్కల బెడద గురించి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్న తట్టికోట్ ఘటన సమయంలోనే మున్సిపల్ అధికారులు స్పందించి ఉంటే ఇప్పుడు ఈ చిన్నారి బలయ్యే వాడే కాదని చెబుతున్నారు. పది నెలల బాలుడు కుక్కలకు ఆహారంగా మారిన ఘటన మున్సిపల్ కమిషనర్‌కు, అధికారులకు తెలియక పోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శునకాలు దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తున్నా బల్దియా వాళ్లకు సమాచారం కూడా లేదని చెప్పడంపై మండిపడ్డారు. ఈ ఉదంతంపై బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణను వివరణ కోరగా, బోధన్‌లో కుక్కల బెడద తగ్గించేందుకు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపారు. నిజామాబాద్‌లో కుక్కల బెడద నివారణ చర్యలు చేపట్టారని, బోధన్‌లోనూ అలాగే చేయాలని నివేదించామన్నారు. త్వరలోనే బోధన్‌లోని శునకాలను తీసుకెళ్లి వాటికి స్టెరిలైజేషన్ చేస్తారని తెలిపారు.

బీసీలు ఉద్యమాలకు సిద్ధం కావాలి

బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

బీసీ సదస్సులో అభివాదం చేస్తున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, రాజారాం యాదవ్

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 10: రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ల కోసం వెనుకబడిన వర్గాలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లో సోమవారం నిర్వహించిన 'బీసీ సదస్సు'లో ఆయన మాట్లాడారు. ఉద్యమాలతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. బీసీ కులగణన నిర్వహించి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జంతువుల లెక్కలు తీసే ప్రభుత్వాలు బీసీల జనాభా లెక్కలు ఎందుకు సేకరించడం లేదని బీసీ నేత రాజారాం యాదవ్ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయడం లేదన్నారు. బీసీలందరూ ఐకమత్యంతో రిజర్వేషన్ల సాధన కోసం పోరాడాలని కోరారు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ నేతలు దేగం యాదగౌడ్, కొండవీటి రాంప్రసాద్, మోతే రామాగౌడ్ పాల్గొన్నారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

అంతర పాఠశాలల క్రీడోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వ్యాపారవేత్త దయానందరెడ్డి

- మనోధైర్యం పెంపొందించేవి క్రీడలు
- గెలుపోటములను సమానంగా తీసుకోవాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ, సెప్టెంబర్ 10: క్రీడలు కేవలం శారీరక దారుఢ్యం కోసమే కాదని, జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినప్పుడు వాటిని తట్టుకుని నిలబడేలా మనోధైర్యం పెంపొందించేందుకు ఉపయోగపడతాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల అంతర పాఠశాలల క్రీడోత్సవాలను బాల్కొండలో ఆయన మంగళవారం ప్రారంభించారు. అంతకు ముందు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. ఆటల్లో గెలుపోటములు సహజమని, అన్నింటినీ సమానంగా స్వీకరించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను కేవలం చదువుల వైపే కాకుండా క్రీడల్లోనూ ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారు ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తన వియ్యంకుడు, వ్యాపారవేత్త దయానందరెడ్డి సేవాభావం గురించి ప్రస్తావిస్తూ ప్రశంసలు కురిపించారు. రూ.60 లక్షలకు పైగా వెచ్చించి బాల్కొండ నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలలకు అవసరమైన డెస్క్ బెంచీలు, స్పోర్ట్స్ మెటీరియల్, కంప్యూటర్లు ఇచ్చారన్నారు. ఎంఈవోలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించాలి

కామారెడ్డి,సెప్టెంబర్ 10: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిపై నెలలోపు నివేదిక సమర్పించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి నెలా చివరి రోజున సివిల్ రైట్స్ డే తప్పకుండా నిర్వహించాలన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన గురుకులాలను అధికారులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి నిబంధనల ప్రకారం బాధితులకు పరిహారం అందిస్తున్నామని తెలిపారు. భూములకు సంబంధించిన కేసులు పరిశీలిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలను ఎస్సీ సింధు శర్మ వివరించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి రజిత, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, డీఎస్పీలు శ్రీనివాసులు, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

భారీ విగ్రహాలన్నీ ఉమ్మెడ గోదావరికి..

- 8 ఫీట్ల లోపు వాటిని యంచకు తరలించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- సీపీ కల్మేశ్వర్‌తో కలిసి నిమజ్జన ఏర్పాట్లు, శోభాయాత్ర మార్గం పరిశీలన

నవీపేట/ నందిపేట్/కంఠేశ్వర్, సెప్టెంబర్ 8: వినాయక నిమజ్జనోత్సవంలో భాగంగా ఎనిమిది ఫీట్ల కన్నా తక్కువ ఎత్తులో ఉన్న విగ్రహాలను బాసర వైపు, భారీ విగ్రహాలను ఉమ్మెడ గోదావరి నది వైపు తరలించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. మంగళవారం ఆయన సీపీ కల్మేశ్వర్‌తో కలిసి నవీపేట మండలంలోని యంచ గోదావరి, నందిపేట్ మండలంలోని ఉమ్మెడ గోదావరి నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఐదు క్రేన్లు, లైటింగ్ ఏర్పాట్లతోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. జాన్కంపేట, నవీపేట రైల్వేగేటు వద్ద ఎలక్ట్రికల్ లైన్స్ కారణంగా ఎనిమిది ఫీట్ల లోపు ఉన్న వినాయక విగ్రహాలను నవీపేట మీదుగా యంచ గోదావరి నదికి తరలించేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. 8 ఫీట్ల కన్నా పెద్ద విగ్రహాలను నందిపేట్ మండలం ఉమ్మెడ గోదావరి వద్దకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే మండపాల నిర్వాహకులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. నిమజ్జనం నేపథ్యంలో యంచ వంతెనపై వన్ వే ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్‌కుమార్, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై కే. వినయ్ ఆయా శాఖల అధికారులు

ఉమ్మెడ గోదావరి నది వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్

సైబర్‌క్రైమ్‌లో ఇందూరు యువకుడు?

అదుపులోకి తీసుకున్న చత్తీస్‌గఢ్ పోలీసులు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 10: నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ యువకుడ్ని చత్తీస్‌గఢ్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఓ సైబర్ నేరానికి సంబంధించిన దర్యాప్తులో భాగంగా తీగ లాగితే సదరు యువకుడికి సంబంధం ఉన్నట్లు తేలడంతో అరెస్టు చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన షారుక్ స్థానికంగా ఉన్న మహిఫిల్ హోటల్ పక్కన మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. అతడికి ఆన్‌లైన్‌లో పరిచయమైన సైబర్ నేరగాళ్లు ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మబలికారు. అయితే, బ్యాంక్ ఖాతా ఓపెన్‌చేసి, ఆయా వివరాలతో పాటు చెక్‌బుక్‌ను సైతం ఇవ్వాలని కండిషన్ పెట్టారు. అందుకు అంగీకరించిన షారుక్.. వాళ్లు చెప్పినట్లే ఎస్‌బీఐలో ఖాతా తెరిచి, వివరాలను అందజేశాడు. దీంతో అతనికి రూ.50వేలు చెల్లించిన సైబర్ నేరగాళ్లు.. ఇతరులను మోసం చేసి, రూ.14 లక్షలను షారుక్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేసుకుని డ్రా చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు చత్తీస్‌గఢ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు రంగంలోకి దిగారు. దర్యాప్తులో భాగంగా సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు నిజామాబాద్ జిల్లాలోని ఎస్‌బీఐ ఖాతాకు బదిలీ అయినట్లు గుర్తించారు. సంబంధిత ఖాతాదారుడి కోసం నిజామాబాద్‌కు వచ్చిన ప్రత్యేక బృందం షారుక్‌ను అరెస్టు చేసి, స్థానిక పోలీసులకు సమాచారమిచ్చింది. అతడ్ని చత్తీస్‌గఢ్‌కు తీసుకెళ్తున్నట్లు తెలిసింది.

నిండుకుండల్లా సాగునీటి ప్రాజెక్టులు

మోర్తాడ్/నిజాంసాగర్, సెప్టెంబర్ 10: ఉమ్మడి జిల్లాలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు మంగళవారం మళ్లీ వరద పెరగడంతో గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎస్సారెస్పీకి సోమవారం ఇన్‌ఫ్లో తగ్గడంతో వరద గేట్లు మూసివేసిన సంగతి తెలిసిందే. అయితే, మంగళవారం ఉదయం 50 వేల క్యూసెక్కులకు పైగా వరద రావడంతో తొమ్మిదిగేట్లను ఎత్తి దిగువ గోదావరిలోకి వదిలారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో గేట్లు మూసివేశారు. మంగళవారం రాత్రి 9 గంటలకు 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ఆ మేరకు వరద కాలువ, కాకతీయ కాలువకు, ఎస్కేప్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1090.90 అడుగులు (80.053 టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ఇక, ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద రావడంతో ఒక గేటు ఎత్తి మిగులు జలాలను వదిలి పెడుతున్నారు. 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ఒక గేటు ఎత్తి 1200 క్యూసెక్కులను మంజీరాలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా, మంగళవారం రాత్రికి 1404.98 అడుగులు (17.773 టీఎంసీలు) గా నీరు నిల్వ ఉందని ఏఈ శివప్రసాద్ తెలిపారు.

నిజాంసాగర్ నుంచి విడుదలవుతున్న మిగులు జలాలు